సాక్షి
గుంటూరు
సోమవారం, 6, ఫిబ్రవరి, 2023

పులిచింతల నీటి నిల్వ




అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.5360 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2962 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 3533 క్యూసెక్కులు వదులుతున్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 990 క్యూసెక్కులు విడుదల చేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ముగిసిన పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్(గుంటూరు): వైఎస్సార్ పెన్షన్ కానుకను చివరి రోజైన ఐదో రోజు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. లబ్ధిదారుల వేలిముద్రలు, ఐరిష్ ఆధారంగా పింఛన్‌లు పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో 99.15 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,53,754 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.68 కోట్లు కేటాయించింది. ఆదివారం సాయంత్రానికి 2,51,609 మంది లబ్ధిదారులకు రూ.69.08 కోట్ల నగదు అందజేశారు.


ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

గుంటూరు, తెనాలిలో 1,811 మంది విద్యార్థులు హాజరు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభావంతులను ఎంపిక చేసి, ఉపకార వేతనాలను అందించేందుకు ఉద్దేశించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరంతో పాటు తెనాలిలో ఏర్పాటు చేసిన 10 పరీక్షా కేంద్రాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన పరీక్షకు దరఖాస్తు చేసిన 1,924 మంది విద్యార్థుల్లో 1,811 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గుంటూరులోని హిందూ కాలేజీ హైస్కూల్, పట్టాభిపురం మున్సిపల్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షల తీరును పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో శైలజ తెలిపారు.

పరమశివుడిని తాకిన సూర్యకిరణాలు



వేటపాలెం: నాయినపల్లిలో వేంచేసిఉన్న గంగా పార్వతి సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో పరమశివుడిని సూర్య కిరణాలు తాకాయి. ఆదివారం ఉదయం దాదాపు 15 నిమిషాల పాటు శివలింగంపై సూర్య కిరణాలు ప్రసరించాయి. దేవస్థాన ప్రధాన అర్చకుడు కారంచేటి చంద్రశేఖరరావు మాట్లాడుతూ కార్తిక మాసం దక్షిణాయనం మార్గశిర మాసంలో దాదాపు 15 రోజుల పాటు ఉదయం 8.45 గంటలకు ప్రతి రోజూ సూర్య కిరణాలు శివుడిపై పడతాయని తెలిపారు. మహా శివరాత్రికి ముందు సూర్యకిరణాలు పరమశివుడిని తాకడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శివాలయాన్ని 1100 ఏళ్ల కిందట చోళరాజులు నిర్మించారని తెలిపారు. శివాలయానికి బ్రహ్మసూత్రం అనే పేరు కూడా ఉందన్నారు. శివలింగంపై మూడు బాణాల గుర్తులు ఉండటం వల్ల దీన్ని బ్రహ్మసూత్రం అంటారని పేర్కొన్నారు. ఇటువంటి దేవస్థానాలు అరుదుగా ఉంటాయని తెలిపారు.

చిక్కులు ఛిద్రం.. భూహక్కు భద్రం

- శరవేగంగా అమలవుతున్న జగనన్న భూహక్కు, భూరక్ష పథకం
- పల్నాడు జిల్లాలో 359 గ్రామాల్లో డ్రోన్ల ద్వారా రీ-సర్వే
- జిల్లాలో 13.66 లక్షల ఎకరాలకు గాను ఇప్పటికే 3.19 లక్షల ఎకరాల్లో సర్వే పూర్తి
- డిసెంబర్ చివరికి జిల్లా మొత్తం రీ- సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు
- 24,417 మంది రైతులకు శాశ్వత హక్కు పత్రాలు జారీ



నరసరావుపేట టౌన్‌హాల్‌లో రైతులకు జగనన్న భూహక్కు-భూరక్ష శాశ్వత హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

సాక్షి, నరసరావుపేట: దశాబ్దాలుగా అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి, రైతులకు సంపూర్ణ భూ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూహక్కు-భూరక్ష ద్వారా భూముల రీ-సర్వే పల్నాడు జిల్లాలో జోరుగా సాగుతోంది. చెదలు పట్టిన భూ రికార్డులు, ఎవరి భూములు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. అడ్డూఅదుపులేని అక్రమాలు ఓ వైపు, న్యాయపరమైన చిక్కులు మరోవైపు. వీటన్నింటికీ పరిష్కారం చూపి రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను శరవేగంగా పంపిణీ చేస్తున్నారు. భూముల రీ-సర్వేకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడంతో దశాబ్దాలుగా ఉన్న భూ చిక్కుముడులు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి. జగనన్న సంపూర్ణ భూ హక్కు పత్రాల్లో క్యూఆర్ కోడ్, మ్యాపుల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్లతో సహా అన్ని వివరాలు ముద్రించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే రైతు తమ భూముల సమస్త వివరాలనూ తెలుసుకోవచ్చు. ఏదైనా పొరపాటు జరిగితే అప్పీల్ చేసుకునే అవకాశం సైతం ప్రభుత్వం కల్పించింది.

24,417 పత్రాలు సిద్ధం..

జిల్లాలో ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో పాటు రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుంటూ భూసర్వే ముందుకు వెళుతోంది. జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 28 మండలాలు, 359 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 13,66,403 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది.

ఇందులో 181 గ్రామాలను సర్వే ఆఫ్ ఇండియా, 178 గ్రామాలను ప్రైవేట్ ఏజెన్సీ డ్రోన్ ద్వారా సర్వే చేయనున్నాయి. మొదటి దశలో జిల్లాలో ఇప్పటి వరకు 154 గ్రామాల్లో డ్రోన్ల ద్వారా 3,19,031 ఎకరాల సర్వే పూర్తయింది. ఇందులో 76 గ్రామాల్లోని భూములకు 13 నోటిఫికేషన్ జారీ చేయడం పూర్తయింది. ప్రస్తుతానికి 53 గ్రామాల్లోని 24,417 మందికి రీసర్వే తర్వాత కొత్త ఖాతాలు జారీ చేశారు. అందులో 17,042 (74 శాతం) మందికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ కలిగిన శాశ్వత భూ హక్కు పత్రాలు, మ్యాప్‌లను అందజేశారు.

మిగిలిన వారికి దశల వారీగా పక్షం రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో రెండు డ్రోన్లు, 51 రోవర్ల సహాయంతో రీసర్వే జరుగుతోంది. 300 మంది విలేజ్ సర్వేయర్లు పది బృందాలుగా పనిచేస్తున్నాయి. ప్రతి గ్రామానికి ఓ సర్వేయర్, ముగ్గురు డెప్యూటీ సర్వేయర్లు పనిచేస్తున్నారు.

భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు లేకుండా



నాకు 1.73 ఎకరాల భూమి ఉంది. దానికి సరైన హద్దులు, మ్యాప్‌లు లేకుండానే దశాబ్దాలు గడిచిపోయాయి. ప్రభుత్వం రీసర్వే ద్వారా నా పొలాన్ని కొలచి, హద్దు రాళ్లు వేయడంతో పాటు శాశ్వత హక్కు పత్రాలు, మ్యాప్‌లు అందజేసింది. ఏ ఆఫీస్ మెట్లు ఎక్కకుండా, రూపాయి లంచం ఇచ్చే అవసరం లేకుండా నా చిరకాల కోరిక తీరింది. భవిష్యత్‌లో ఎటువంటి భూ సమస్యలు రాకుండా రీసర్వే ఎంతో ఉపయోగపడుతుంది.

– ఇగుటూరి కోటిరెడ్డి, రైతు, దొండపాడు గ్రామం, నరసరావుపేట రూరల్ మండలం

వేగంగా శాశ్వత హక్కు పత్రాలు జారీ



వందేళ్ల తర్వాత తొలిసారి పూర్తిస్థాయిలో భూములు రీ-సర్వే జరుగుతోంది. భూమిలో ఎవరు సాగు చేస్తున్నారు, హద్దులేంటి, ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నాయా? అన్న విషయాలను సమగ్రంగా పరిశీలించి రికార్డులను స్వచ్ఛీకరిస్తున్నాం. పూర్తి పారదర్శకంగా, వివాదాలు శాశ్వత పరిష్కారం అయ్యేలా సర్వే జరుగుతోంది. అందులో భాగంగా సర్వే పూర్తయిన 53 గ్రామాల్లోని 24,417 మందికి భూహక్కు పత్రాల పంపిణీ వేగంగా జరుగుతోంది. ఈ డిసెంబర్‌లోగా జిల్లాలో ప్రతి రైతు పొలం రీసర్వే చేసి శాశ్వత హక్కు పత్రాలు అందజేయనున్నాం.

– శివశంకర్ లోతేటి, కలెక్టర్, పల్నాడు జిల్లా

మంగళగిరి నరసింహునికి తెప్పోత్సవం

సీతానగరం ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



తాడేపల్లిరూరల్: మంగళగిరి లక్ష్మీనరసింహస్వామికి మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా కృష్ణా నదిలో ఆదివారం అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఉదయం 8 గంటల సమయంలో మంగళగిరి లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేక వాహనంలో సీతానగరంలోని కోదండ రామ సమేత వీరాంజనేయస్వామి దేవస్థానానికి తీసుకువచ్చారు. సీతానగరంలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై ఉన్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. సీతానగరం కోదండరామ సమేత వీరాంజనేస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం నూతన వస్త్రాలతో అలంకరించిన అనంతరం కృష్ణానది ఎగువ ప్రాంతంలోని పడవల రేవు వద్ద ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేసిన పంటుకి నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేసి, మేళతాళాలు, బాణసంచా మధ్య పూజలు చేస్తూ కృష్ణానదిలో లక్ష్మీనరసింహస్వామికి తెప్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో రామ కోటిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభాచార్యులు, శ్రీనివాస దీక్షితులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న ఉదయభాను దంపతులు

వైభవం.. కల్యాణోత్సవం

పెనుగంచిప్రోలులో వేంచేసిన గోపయ్య సమేత తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల ఆదివారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంలో రాత్రి 8. 42 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి పీటలపై కూర్చొన్నారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి వంశీకుల తరపున కొల్లా రాజశేఖర్, అపర్ణ దంపతులు, స్వామి వారి వంశం తరపున కాకాని రంజిత్‌కుమార్, నిశిత దంపతులు, ఆర్డీఓ రవీంద్రరావు, ఆలయ ఈఓ జీవీడీఎల్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, నందిగామ ఏసీపీ జి. నాగేశ్వరరెడ్డి దంపతులు కల్యాణ పీటలపై కూర్చోగా.. వేద పండితులు, గ్రామ పురోహితులు, ఆలయ ప్రధాన అర్చకులు పాపమాంబ వంశీకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు.

– పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట)



కల్యాణానికి హాజరైన అశేష జనం

అ‘పూర్వ’ సమ్మేళనం

- నలభైఏళ్ల లా విభాగ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న వైనం
- ఏఎన్‌యూ లా విభాగానికి పూర్వ వైభవం తెద్దామని నిర్ణయం
- మధురానుభూతులు పంచుకున్న పూర్వ విద్యార్థులు
- అధ్యాపకుల బోధనలే ఉన్నతికి మార్గదర్శకమన్న పూర్వ విద్యార్థులు



లా పూర్వ విద్యార్థుల సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, పక్కన హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ ప్రసాద్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లా విభాగ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో వైభవంగా జరిగింది. దేశ వ్యాప్తంగా న్యాయరంగంతో పాటు పలు రంగాల్లో స్థిరపడిన లా విభాగ పూర్వ విద్యార్థులందరూ సమావేశానికి హాజరయ్యారు. 1979లో లా విభాగం ప్రారంభమైనప్పటి నుంచి అన్ని బ్యాచ్‌లకు చెందిన 400 మందికిపైగా పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నాటి మధురానుభూతులను గుర్తుచేసుకున్నారు. సరదా సంఘటనలు కొందరు చెబితే, సమాజానికి, యూనివర్సిటీకి, విద్యార్థి లోకానికి పనికొచ్చే అంశాలపై తాము చేసిన పోరాటాలను మరికొందరు గుర్తుచేసుకున్నారు. అధ్యాపకులతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఎంతో సంబరపడ్డారు.

సాంబారు కథతో నవ్వులే.. నవ్వులు..

విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య ఎ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యూనివర్సిటీ సాంబారుకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. హాస్టల్‌లో సాంబారు తిని క్లాసుకు వచ్చి మత్తుగా నిద్రపోయేవారని, దాంతో కొద్దిసేపు క్లాస్ ఆపి టీ బ్రేక్ ఇస్తే, తరువాత మత్తు వదిలి అప్పుడు పాఠం వినేవారనిఎదురుగా కూర్చున్న పూర్వ విద్యార్థులను చూస్తూ అనడంతో అందరూ ఘల్లునానవ్వారు.

పాదాభివందనాలు, ఫొటోలు, సెల్ఫీలు..

సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమ అధ్యాపకులకు పాదాభివందనాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి పూర్వ విద్యార్థులైన ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు, ఒక వీసీ, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్, మానవ హక్కుల కమిషన్ సభ్యులతో పాటు 20 మంది వరకు న్యాయమూర్తులు హాజరయ్యారు. వీరెవ్వరూ గురువులతో పాటు వేదికపై కూర్చోమని స్పష్టం చేశారు. ఎంత ఎదిగినా తాము గురువులకు శిష్యులమేనని వేదిక ముందే కూర్చుని గురువుల ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. గురువులతో ఫొటోలు, సెల్ఫీలు దిగి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించుకున్నారు.

లా కోర్సు ప్రారంభించాల్సిందే..

దేశంలోనే ఎంతో ప్రత్యేకత ఉన్న ఏఎన్‌యూ లా విభాగంలో నేడు లా కోర్సు లేకపోవడం విచారకరమని సమావేశంలో పాల్గొన్నవారందరూ అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ, సమాజ ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు దోహదం చేసే లా కోర్సును మళ్లీ ప్రారంభించేందుకు అందరం కలిసి కృషి చేద్దామని స్పష్టం చేశారు. కోర్సు మళ్లీ ప్రారంభిస్తే వీలైనప్పుడు పాఠాలు చెప్పేందుకు తాము సిద్ధమని హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు అన్నారు. సమావేశంలో లా విభాగ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య వైఆర్ హరగోపాల్‌రెడ్డి, ఆచార్య ఎ.సుబ్రహ్మణ్యం, ఆచార్య ఎన్.రంగయ్య, ఆచార్య రాయప్ప, ఆచార్య హాస్కరరావు, ఆచార్య జయశ్రీ, పూర్వ విద్యార్థుల్లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ వి.రాధాకృష్ణ కృపాసాగర్, డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ఆచార్య వి.సూర్యప్రకాష్, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, హైకోర్టు పీపీ నాగిరెడ్డి, ఏపీ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ గోచిపాత శ్రీనివాస్, 20 మందికిపైగా న్యాయాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- రామకృష్ణాపురం గురుకుల ఘటనలో క్షేమంగా విద్యార్థులు
- బ్యాక్టీరియా వల్లే విద్యార్థులకు అస్వస్థత
- గురుకులంలో వసతుల కల్పనకు నిధుల విడుదల
- మరే ఇతర విద్యా సంస్థలో ఇలాంటి ఘటన జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు
- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

సాక్షి, నరసరావుపేట: గురుకులాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక గురుకుల పాఠశాలలో గత నెల 30వ తేదీ విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గురుకులాలపై ప్రత్యేక దృష్టిసారించారు. రామకృష్ణాపురం గురుకులంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు మరెక్కడా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. రామకృష్ణాపురం గురుకులంలో 210 మంది అస్వస్థతకు గురికాగా, తక్షణ వైద్య సేవ అనంతరం 209 మందిని క్షేమంగా వారివారి ఇళ్లకు పంపడం జరిగింది. ఒకరికి ప్రస్తుతం వైద్యం కొనసాగుతోంది. ఆర్‌ఓ ప్లాంట్ నుంచి వచ్చే తాగునీరు కలుషితం అవడంతో పాటు పాత్రలు శుభ్రపరిచే దగ్గర బ్యాక్టీరియా ఏర్పడి ఈ సంఘటన జరిగిందని ప్రాథమికంగా అధికారులు గుర్తించారని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ‘సాక్షి’కి తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

ఆహార పదార్థాలు ఏవీ కలుషితం కాలేదని తెలిపారు. సంఘటన అనంతరం సంబంధిత ప్రిన్సిపాల్, హెల్త్ సూపర్‌వైజర్, ఫిజికల్ డైరెక్టర్లను సస్పెండ్ చేయడంతో పాటు, ఆరుగురు వంట సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి నాడు -నేడు కార్యక్రమం కింద రూ.60 లక్షలతో పనులు చేపట్టడం జరిగిందని, ఇంకా అవసరమైన పనులు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రామకృష్ణాపురం గురుకులంలో తీసుకుంటున్న చర్యలు..

- రూ.లక్షతో ఆర్‌ఓ ప్లాంట్‌కు మరమ్మతులు చేసి పీహెచ్ విలువ 7-7.5 మధ్య ఉండేలా చేయనున్నారు.
- ఇప్పటికే గురుకులంలో మూడు బోర్లు ఉండగా, అందులో రెండు పనిచేస్తున్నాయి. పనిచేయని బోరు మరమ్మతుకు కలెక్టర్ శివశంకర్ వెంటనే రూ.లక్ష నిధులను విడుదల చేశారు.
- డ్రైన్ నిర్వహణ సరిగాలేక బ్యాక్టీరియా ఏర్పడిందని గుర్తించిన నేపథ్యంలో మురుగునీటి నిర్వహణ కోసం రూ.3.5 లక్షలతో పనులు వెంటనే చేపట్టనున్నారు.
- గురుకుల పాఠశాల ప్రాంతంలో ఉన్న పురాతన భవనాల స్థితిగతులను బట్టి వినియోగానికి వీలు లేని భవనాలను కూల్చివేయాలని సంబంధిత ఈడబ్ల్యూఐడీసీ (విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ)అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
- గురుకులంలో ఇంకా ఏమైనా అవసరమైన మౌలిక వసతులు ఉంటే పనులు చేపట్టాలని స్థానిక ఎంపీడీఓకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఇతర విద్యా సంస్థల్లో ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా..

సత్తెనపల్లిలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తూనే ఇలాంటి ఘటనలు జిల్లాలో పునరావృతం కాకుండా కలెక్టర్ పలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

- జిల్లాలోని మోడల్, గురుకుల పాఠశాలల్లో పరిస్థితులను అంచనా వేసే విధంగా కమిటీలను వేశారు.
- ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్ డే రోజున స్పెషలాఫీసర్లు మండల అధికారులతో కలిసి తన పరిధిలోని గురుకుల పాఠశాల, మోడల్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, ఆహారం నాణ్యత, అక్కడ నెలకొన్న సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు.
- శుక్రవారం కాకుండా మిగిలిన రోజుల్లో ఏదో ఒక రోజు ఆకస్మికంగా ఓ పాఠశాలలో ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్, ఎంఈఓలు విద్యార్థులతో కలసి భోజనం చేయాలి.
- పాఠశాల పరిధిలో పనిచేసే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు రోజు మార్చి రోజు విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేయాలి. నాణ్యతను పరిశీలించాలి.
- అన్ని పాఠశాలల్లో నీటి నాణ్యత, మురుగునీటి నిర్వహణ ఎలా జరుగుతుందో పరిశీలించాలని ఓ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు.

11 నుంచి జూడో రాష్ట్ర స్థాయి పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: జూడో సబ్ జూనియర్, క్యాడెట్ రాష్ట్ర స్థాయి బాలబాలికల పోటీలను ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఏపీ జూడో అసోసియేషన్ కార్యదర్శి నామిశెట్టి పవన్‌సందీప్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని మాంటిసోరి కాలేజీ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జట్లు 11న ఉదయం 10 గంటల లోపు ఎంపిక ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలన్నారు. నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.



రెడ్డి జాతి అభ్యున్నతికి కృషి

ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ కుమార్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గం

గుంటూరు రూరల్: రెడ్డి జాతి అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం కృషి చేస్తుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నగర శివారు హౌసింగ్ బోర్డ్‌లోని కార్యాలయం వద్ద ఆదివారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కమిటీ పలు తీర్మానాలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాల ఏర్పాటు, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా పోరాటం, విద్యార్థులకు రెడ్డి పారిశ్రామిక వేత్తల సహకారంతో ఆర్థిక సహాయ సహకారాలు అందించడం, భవిష్యత్తులో భారీస్థాయిలో రెడ్ల ఐక్యత సభను నిర్వహించడం వంటి తీర్మానాలు ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట శివారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దండు ధర్మారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి, కోశాధికారి సురేంద్రరెడ్డి, గౌరవాధ్యక్షుడు భయ్యపరెడ్డి, అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి, సలహాదారులు విజయభాస్కర్‌రెడ్డి, శివగంగిరెడ్డి, నారదరెడ్డి, మహిళా విభాగం అరుణకుమారి, శ్రీరెడ్డి, సుశీలారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కోటిరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణం ప్రారంభించాలి

ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు ప్రజా సంఘాల వినతి



ఎమ్మెల్యే సుచరితకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: నగరంలోని ఏసీ కళాశాల ఎదురుగా నిరుపయోగంగా ఉన్న అంబేడ్కర్ భవనం స్థానంలో ప్రభుత్వం చొరవ తీసుకుని నూతన నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు ఆదివారం భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవనం నిర్మించి శతాబ్దాలు గడిచినందున ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని, నూతన నిర్మాణాన్ని చేపట్టే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు నీలాంబరం, బాపట్ల ఏసుబాబు, తాటికొండ నరసింహారావు, జొన్నలగడ్డ శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, విల్సన్‌రాజు, సుజాతారావు, కమల కుమారి, బాజీ పాల్గొన్నారు.

శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి దేవస్థానము
వల్లమూడి (క్వారి) గ్రామము, చేబ్రోలు మండలము, గుంటూరు జిల్లా.

e-Procurement Tender
RC No.CEO/1295/2022-25 Dt: 25-01-2023
దేవాలయ పునర్నిర్మాణము పనికి గాను e-procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు http://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : కార్యనిర్వాహణాధికారి

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ 10th, ఇంటర్(ఒకేసం॥లో), డిగ్రీ(1-3సం॥లో) BA, BCom, BSc, MA, MCom, MBA, MSc (All Groups) పాస్ గ్యారంటీ శిక్షణ, సంప్ర॥శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్, 2/11 బ్రాడీపేట,Gnt:8008145999

■ ఇంద్రా,SV యూనివర్సిటీ నుండి ఇంటర్ పాసైన వారు 3సం॥రాలలో BSc, BCom, BA లు PG (All) ను డైరెక్ట 10th, ఒకేసం॥లో ఇంటర్,14.08.24కి పొందుటకై శ్రీ సత్య సూర్య కాలేజ్, గుంటూరు:9346446079

REAL ESTATE

■ 1 సెంటు 30 వేలు 1సం॥గ 610రూ, 25సెంట్లు భూమిలో 100 ఎర్రచందనం మొక్కలతో కేవలం 7.50 & 8.50లక్షలు పట్టాదారు పాసు పుస్తకం కలదు. 10సం॥లకు సుమారు కోటి రూపాయలు పైనే ఆదాయం. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9906188866

RENT

■ For Rent Pattabipuram, 3rd Cross Left Side, 3 BHK Plot 201 Incl Car Parking, Relax, Cont : 9436388058.

SERVICES

BUSINESS OFFER

■ ఒక సరైయిన రోజువారి ఆదాయ అవకాశం. కేవలం అతి తక్కువ పెట్టుబడితో ఒక మంచి ప్రయత్నం ఇప్పుడే ప్రారంభించండి. Dont Miss. సంప్ర॥ 7793987988

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థల లో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్, సంప్ర॥ 96590 57777

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

■ సంప్ర. సెల్: 79977 89771, బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ,ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. (100% జెన్యూన్)

TOURS & TRAVELS

■ 20రోజులు గంగా నది పుష్కర స్నానములకు కాశీ, అలహాబాదు, అయోధ్య, గయ, హరిద్వార్, రుషికేష్, వివాహాది శుభకార్యములకు బస్సులు సప్లై చేయబడును మోడరన్ ట్రావెల్స్, గుంటూరు:9290028188

WANTED

■ గుంటూరు బస్టాండ్ ఎదురు ఆఫీస్ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qul: 10th to Degree, Salary: 8,000/- to 10,000/- T: 9:00 AM to 6:00 PM. Ph: 9989398775

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుకలెట్ కొరకు 9058509586

■ బిజినెస్ మేనేజర్స్/ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, తెలుగు, ఇంగ్లీష్ భాషలపై నైపుణ్యం, 5 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం గలవారు రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు.

■ గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు ఆయాలు కావలెను. సంప్ర: 8885590905

■ మీ ఇంటివద్దనే ఉండి ప్రముఖ కంపెనీకి చెందిన Meterial Writting Work చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. P/F Time, Sal: 15k-20k ✆ 8790174076

■ ఫిమేల్ హాస్టల్ ఇంచార్జీలు కావలెను. ఇంటర్ చదివి ఉండవలెను.జీతం॥ 10,000/- వరకు ఇవ్వబడును. భోజనం మరియు వసతి ఇవ్వబడును. మాస్టర్‌మైండ్స్, 3/11 బ్రాడీపేట, గుంటూరు. ఫోన్: 9100024059

■ GNT బ్రాడీపేట+కాకానిరోడ్‌లో వర్క్ చేయుటకు లేడీటెలికాలర్స్+రిసెప్షనిస్ట్ 60 కావలెను. నోటా రైట్స్, P/t, F/T, T: 9AM-9PM స్పాట్ జాయినింగ్, జీ.8000-15000: 7287821439, 8297782714

■ విజయవాడ గుంటూరులోని శ్రీమంతుల ఇండ్ల లో పేషంట్స్‌ను చూసుకొనుటకు ఆడ, మగ స్టాఫ్ కావలెను. జీ: 15,000/- 25,000/- ఫ్రీ ఫుడ్ + రూమ్. సం॥ 6309095202, 9392442511

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైం 1గం॥ పోస్టల్ కవర్స్‌పై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. కాల్/వాట్సాప్. 9704987227

■ Need Recovery Executives and Telecallers Age-21+ Guntur Local Candidates only Freshers only. Salary: 9000 & 12,000. Cell: 9959907895

■ గుంటూరు గోరంట్ల మెయిన్ రోడ్డులోని ఇంటర్‌నెట్ & జిరాక్స్ షాపు నందు పని చేయుటకు అనుభవం గల M/F కావలెను. ఆకర్షణీయమైన జీతం. 9581111876

■ గుంటూరు అరండల్‌పేట 1వలైనులోని ప్రముఖ బార్ అండ్ రెస్టారెంట్ నందు పనిచేయుటకు రెప్షనిస్ట్, వెయిటర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + భోజన వసతి. సంప్ర॥ 97084 44414

■ తెనాలి నందు కృష్ణ & పౌల్ట్రీ చికెన్స్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, కలెక్షన్ బాయ్స్, Tally తెలిసిన లేడీ కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను: 9052290512

■ Wanted Sales Executives for Bajaj Finance Ltd. Qul:Inter & above salary: 10000+Incentives up to 20000.2 wheeler must only for mens.Guntur :9700282826

■ గుంటూరు ఆటోనగర్‌లోని పెట్రోల్‌బంక్ నందు పనిచేయుటకు పంప్ బాయ్స్ & గర్ల్స్ కావలెను. మంచిజీతం. Day డ్యూటీ. సంప్ర॥ :7799689889, 8074546302

■ ప్రముఖ సంస్థ లో పనిచేయుటకు మార్కెటింగ్ ఆఫీసర్లు, టెలికాలర్స్ DTP ఆపరేటర్లు మహిళ/పురుషులు కావలెను. జీతం+ అలవెన్సులు కలవు. 8639578021

■ Intel High School, Perecharla Wanted Natural Science teachers to teach 8th & 9th Classes part time. Salary Rs. 4k-5k per hour. 9908098073

■ గుంటూరు పట్టణ వివాహిత మహిళలకు రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లేడీస్ బ్రాంచ్‌లో ఉద్యోగ అవకాశం. బోలు 12, Q: డిగ్రీ, A: 28-35 సం॥, సంప్ర॥ ✆ 86390 88896, 93483 66867

■ మార్టూరు శ్రీ శారదానికేతన్ పబ్లిక్ స్కూల్ నందు అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ 1 అడ్మినిస్ట్రేటివ్ (HR)1 వంట మనిషి 1, వంట అసిస్టెంట్-1 వెంటనే కావలెను ✆ 91004 63624, 85001 44199

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO, క్లర్క్స్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను. (M/F) ఒరిజినల్ సర్టిఫికెట్‌తో సంప్రదించండి. 90630 89233.

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడలో వృద్ధులను / పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు (M/F) కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం16,000/- ✆ 96406 28899, 96406 48899

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520

■ ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు టిఫిన్ మాస్టర్స్, టీమాస్టర్స్, అసిస్టెంట్స్, క్యాషియర్స్, వెయిటర్స్ (M/F) కావలెను. రూమ్+భోజనం వసతి కలదు. ✆ 90008 43633

■ శ్రీలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ ఇంట్లో వుండి డేటా ఎంట్రీ మరియు ఓల్డ్ రికార్డ్స్ చూసుకొని న్యూ రికార్డ్స్ రాయుటకు యువతి/ యువకులు కావలెను. వీక్లీ పేమెంట్ కలదు. సంప్ర: 8885327824.

■ స్టార్ హోంకేర్ Hyd. లో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు లేడీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు, టెలీకాలర్స్ కావలెను. జీతం : 18,000/- to 25,000/-, రూం + భో. ఫ్రీ. ఫోన్ : 86391 32775, 86398 28228

■ ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ మరియు ఫైనాన్స్ అండ్ చిట్ ఫండ్ కంపెనీ లో అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, రికవరీ ఏజెంట్స్ కావలెను. జీతం: 22000/- ఆ పైన, రూము+భోజనం ఫ్రీ. ఫోన్ : 9985784184

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ నెంబర్లలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
97034 67843
97030 13015
92904 02000

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

‘ఫిష్ ఆంధ్ర’లో ఆధునిక చేపల దుకాణాల ఏర్పాటు

- జిల్లా మత్స్య అధికారి బాబు
- జిల్లాలో 232 ఏర్పాటుకు సన్నాహాలు
- కొనసాగుతున్న లబ్ధిదారుల ఎంపిక



చేపల విక్రేతలతో మాట్లాడుతున్న జిల్లా మత్స్య అధికారి బాబు

తెనాలి: ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా ఆధునిక చేపల అమ్మకం దుకాణాల ఏర్పాటుకు జిల్లాలో ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నట్టు జిల్లా మత్స్య అధికారి డాక్టర్ వీవీఆర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో మార్చి 31వ తేదీలోగా నాలుగు వేల దుకాణాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి, జిల్లాకు 232 దుకాణాలు (మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు) లక్ష్యంగా నిర్ణయించిందని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఆదివారం జిల్లా మత్స్య అధికారి డాక్టర్ వీవీఆర్ బాబు, తన బృందంతో తెనాలి పర్యటించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట, మార్కెట్ సెంటర్, చెంచుపేట, చినరావూరు తోటలో చేపలు విక్రయిస్తున్న స్థానిక, స్థానికేతరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఆధునిక దుకాణాలను ఏర్పరచుకుని ఆరోగ్యకరమైన, లాభదాయక వ్యాపారం చేయొచ్చని వ్యాపారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ మున్సిపాలిటీలో చేపల అమ్మకం దుకాణాల ఏర్పాటుకు 47 స్థలాలను మున్సిపాలిటీ సూచించినట్టు తెలిపారు. ప్రతి మినీ యూనిట్ ఏర్పాటుకు 12 /10 అడుగుల దుకాణం అవసరమని డాక్టర్ బాబు చెప్పారు. అది సొంత షాపు లేదా అద్దెది అయివుండొచ్చని చెప్పారు. 120 చదరపు అడుగుల స్థలం ఉన్నట్టయితే కంటైనర్, షెడ్ రూపంలో దుకాణం నడుపుకోవచ్చని అన్నారు. షాపు యూనిట్ ధర గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష, చిన్న పట్టణాల్లో రూ.2 లక్షలు, నగరాల్లో రూ.3 లక్షలు అవుతుందని తెలిపారు. లబ్ధిదారు తన వాటాగా 10 శాతం చెల్లిస్తే, మిగిలిన మొత్తాన్ని సెక్యూరిటీ లేని రుణంగా బ్యాంకుల ద్వారా సమకూరుతుందని వివరించారు. మత్స్యశాఖ రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు సబ్సిడీని అందిస్తుందని చెప్పారు. షాపులు లేదా సొంత స్థలం లేనివారు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, మార్కెటింగ్, ఆర్టీసీ స్థలాల్ని లీజుకు ఇప్పిస్తామని తెలిపారు. తెనాలిలో ఎంపీడీవో, మెప్మా కార్యాలయంలో జరిగిన సమావేశాల్లో ఇప్పటికే 25 మంది లబ్ధిదారుల్ని గుర్తించినట్టు వివరించారు. వీరితో గుంటూరు మత్స్య అభివృద్ధి అధికారి జైనుల్లాఖాన్, గ్రామ మత్స్య సహాయకులు అనూష, శివపార్వతి, మున్సిపాలిటీ చైన్‌మెన్లు వెంకటరామయ్య, వీరయ్య, లక్ష్మీనారాయణ, స్థానిక మత్స్య వ్యాపారి సురేంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘ బైలా సవరణకు ఉత్తర్వులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ బైలా సవరణకు ప్రభుత్వం జీవో ఎం.ఎస్. నంబరు 17 ద్వారా ఈనెల 2న ఉత్తర్వులు విడుదల చేసినట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సవరించిన బైలా ప్రకారం జిల్లా పరిషత్, మండల పరిషత్, జెడ్పీ హైస్కూల్స్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ డివిజన్, సబ్ డివిజన్లలో పనిచేస్తున్న పరిపాలనాధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్స్, టైపిస్టులు, స్టెనోగ్రాఫర్స్, రికార్డ్, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్స్ ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు. 1965లో గుర్తింపు పొందిన ఈ సంఘం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తోందని, సంఘ పటిష్టతకు సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. బైలా సవరణకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లాలో 52,558 హెక్టార్లలో రబీ పంటల సాగు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో రబీ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 71,624 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 52,558 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గత అక్టోబర్ చివరి వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 1,082 హెక్టార్లు ఉండగా 510 హెక్టార్లలో నాట్లు వేశారు. జొన్న 22,077 హెక్టార్లకు గాను 8,941 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న సాధారణ సాగు 20,514 హెక్టార్లకు గాను 24,291 సాగు చేశారు. కంది 112 హెక్టార్లకు గాను 20 హెక్టార్లు సాగు చేశారు. మంచి శనగ 10,098 హెక్టార్లకు గాను 6,196, పెసర 10,323 హెక్టార్లకు గాను 7,766, మినుము 6,518 హెక్టార్లకు గాను 4,314, పొగాకు 754 హెక్టార్లకు గాను 520 హెక్టార్లలో రైతులు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు వివరించారు.

స్కూలు బస్సు సీజ్



బస్సు వద్ద ఆర్టీఓ అధికారులు

నెహ్రూనగర్: స్కూలు బస్సుల్ని టూరిస్ట్ బస్సులుగా తిప్పితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం హెచ్చరించారు. ఓ విద్యా సంస్థకు చెందిన స్కూలు బస్సు పెళ్లికి కాంట్రాక్ట్ గ్యారేజ్‌గా మాట్లాడుకుని తిప్పుతుండగా ఆదివారం నగరంలో తనిఖీ చేపట్టి సీజ్ చేసినట్లు చెప్పారు. స్కూలు బస్సుల్ని విద్యార్థులను చేరవేయడానికి మాత్రమే వినియోగించాలని, టూరిస్ట్ బస్సులుగా తిప్పితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక



నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు

మోతడక(తాడికొండ): గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం తాడికొండ మండలం మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. అసోసియేషన్ నూతన ప్రెసిడెంట్‌గా వి. వీరభద్రారెడ్డి, కార్యదర్శిగా సీహెచ్. పుల్లయ్య, ట్రెజరర్‌గా ఝాన్సీరాణి, చైర్మన్‌గా వై.వి.ఆంజనేయులు, చీఫ్ పాటర్న్‌గా కళ్ల మోహన్‌రెడ్డి, సీఈవోగా వడ్రాణం మార్కండేయబాబు, కో-ఆర్డినేటర్‌గా దాసరి కోటేశ్వరరావు నియమితులయ్యారు. రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ తరఫున కాశీవిశ్వనాథరెడ్డి, శాప్ గుంటూరు కోచ్ నరసింహారావు, ఒలింపిక్ అసోసియేషన్ వెంకటేశ్వరరావు, జిల్లా ఖోఖో అసోసియేషన్ మాజీ కార్యదర్శి పి. రావుకిశోర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జె.ఎస్.సురేష్

నరసరావుపేట రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని నరసరావుపేట ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎస్. సురేష్ అన్నారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం గుంటూరు, ఎడ్యుకేటెడ్ సొసైటీ సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఇతర అంశాలలోని పోటీలను ఆదివారం ప్రారంభించారు. గుంటూరు జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలలోను కూడా రాణించినట్లయితే శారీరకంగా, మానసికంగా ఏ సమస్యనైనా ఎదుర్కొనే శక్తి కలుగుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ జె.ఎస్.సురేష్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సమానమని, ఓటమి గెలుపుకు నాంది అని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు కృష్ణారెడ్డి, ఝాన్సీరాణి, రాజేంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

టీటీడీ బోర్డు సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్



గుడ్డసంచులు ఆవిష్కరించి మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యులు దాసరి కిరణ్‌కుమార్

నరసరావుపేట: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని టీటీడీ బోర్డు సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో సంస్థ రూపొందించిన గుడ్డ సంచులను ఆదివారం ఆవిష్కరించారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుడ్డ సంచి, జ్యూట్ బ్యాగ్‌గాని తీసుకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం కూడా ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా ప్రకటించమైందని తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ సభ్యులు ఆర్.బంగారయ్య వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి కొండలరావు, ఎన్.కె. ఆంజనేయులు, కొవ్వూరి శివమోహన్, కొవ్వూరి బాబు, కాసా రామశ్రీను, బాపట్ల సురేష్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

మేదరమెట్ల: కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొరిశపాడు మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వరరావు అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన పాణ్యం నాగ దుర్గారావు, భార్య కావేరి(22) వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్లి జీవనం సాగిస్తున్నారు. భార్యాభర్తలు చిన్నచిన్న విషయాలకు తరచూ గొడవపడుతుండేవారు. ఈ నేపథ్యంలో కావేరి ఆదివారం గడ్డి మందు తాగింది. అత్త గమనించి తొలుత మేదరమెట్లలోని ప్రైవేటు వైద్యశాలకు, అక్కడ నుంచి ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించింది. చికిత్స పొందుతూ కావేరి మృతి చెందింది. భర్త దుర్గారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలి స్థలం కబ్జా

- రౌడీషీటర్ దావు కోటేశ్వరరావుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు
- విచారణ చేపట్టిన మంగళగిరి రూరల్ పోలీసులు

మంగళగిరి: రూ. కోటి పైగా విలువైన విశ్రాంత ఉపాధ్యాయురాలి స్థలాన్ని ఓ రౌడీషీటర్ కబ్జా చేసిన ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నగరంలోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు దేవరపల్లి భాగ్యలక్ష్మి భర్త మల్లికార్జునరెడ్డి మరణానంతరం 2005లో మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం సర్వే నంబర్ 766/2లో 525 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటి నుంచి స్థలంలో ఎటువంటి నిర్మాణాన్ని చేపట్టకపోవడంతో స్థానికంగా అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ దావు కోటేశ్వరరావు కన్ను పడింది. అనుకున్నదే తడవుగా స్థలాన్ని కబ్జా చేసి రేకుల షెడ్డు నివాసాన్ని నిర్మించడంతో పాటు చుట్టూ ఇనుప ఫెన్సింగ్ వేయించాడు. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో స్థలాన్ని పరిశీలించేందుకు విశ్రాంత ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి సోదరి కుమారుడు వేణుగోపాలరెడ్డితో కలసి వచ్చారు. రేకుల షెడ్డుతో పాటు చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉండటంతో నిర్ఘాంత పోయింది. అదే సమయంలో కబ్జా చేసిన రౌడీషీటర్ దావు కోటేశ్వరరావు తన అనుచరులు కొందరితో అక్కడికి వచ్చాడు. స్థలం తనదేనని, తాను ఓ పెద్ద రౌడీషీటర్‌నని చెప్పి దాని జోలికి వస్తే చంపేస్తానని బెదిరించాడు. దీంతో విశ్రాంత ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మంగళగిరి రూరల్ పోలీసుల్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. స్పందించిన రూరల్ పోలీసులు దావు కోటేశ్వరరావుతో పాటు మరో ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి హెచ్‌ఐవీ బాధితులకు హెపటైటిస్ వ్యాక్సిన్

గుంటూరు మెడికల్: ఏఆర్టీ సెంటర్స్‌లో పేర్లు నమోదు చేసుకుని, మందులు వాడుతున్న హెచ్‌ఐవీ బాధితులకు సోమవారం నుంచి హెపటైటిస్-బీ పరీక్షలు చేసి ఉచితంగా వ్యాక్సిన్లు వేయనున్నట్లు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్ తెలిపారు. గుంటూరు జీజీహెచ్ ఏఆర్టీ సెంటర్, గోరంట్ల ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిత వ్యాధుల హాస్పిటల్, మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్, తెనాలి జిల్లా ఆస్పత్రి ఏఆర్టీ సెంటర్స్‌లో సుమారు 16వేల మందికి ఉచితంగా హెపటైటిస్- బీ వ్యాక్సిన్లు వేస్తామని పేర్కొన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి, నేషనల్ హెల్త్ మిషన్, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, పెప్ ఫార్, షేర్ ఇండియా సంస్థల సహకారంతో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు వివరించారు. హెచ్‌ఐవీ బాధితులు, హైరిస్క్ గ్రూపు సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్ జెండర్లు, వలసదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

లంక గ్రామాల్లో పెచ్చరిల్లుతున్న పెత్తందార్ల ఆగడాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు తదితరులు

తెనాలి: రాష్ట్రంలో భూమాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని గాజుల్లంక, పెదలంక, చింతల్లంక గ్రామాల్లో ఇటీవల ఆర్సీ భూములు సాగుచేస్తున్న దళితులపై పెత్తందార్లు దాడి చేసిన సంగతిని ఆయన ప్రస్తావించారు. ఆదివారం తెనాలి వచ్చిన శ్రీనివాసరావు చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు సాగు చేసుకుంటున్న భూముల్ని పెత్తందారులు దౌర్జన్యంగా లాక్కుంటుంటే, వారికి ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. దేవదాయ భూములు, అటవీ భూములు, గ్రామకంఠాలు, కాలువ కట్టలు, చెరువు గట్లు, అసైన్డ్ భూముల్లో దందాలు నడుస్తున్నాయని చెప్పారు. దాడికి పాల్పడినవారిపై తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి, దాడికి గురైన పేదలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ పరిణామాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించాలని ఆయన కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ పేదలపై పెత్తందార్లు దాడులకు పాల్పడుతుంటే అధికార పార్టీ నాయకులు మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. హత్యాయత్నం చేసిన వారిపై 307, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు వారికే అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న తెలుగుదేశం, పేదల పక్షమని చెప్పుకుంటున్న జనసేనలు కనీసం స్పందించకపోవటం బాధాకరమని తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, బాపట్ల జిల్లా కన్వీనర్ శరత్, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులందరికీ గుర్తింపు కార్డుల మంజూరు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కార్మిక శాఖ అధికారి సాంబశివారెడ్డి

మేడికొండూరు: రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు గుర్తింపు కార్డులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి కళ్లం సాంబశివారెడ్డి తెలిపారు. ఇండియన్ లేబర్ లైన్ ఆధ్వర్యంలో ఆదివారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ నేతృత్వంలో పేరేచర్ల గ్రామ పరిధిలోని క్వారీల కూలీలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి సాంబశివారెడ్డి మాట్లాడుతూ మూడు నెలలుగా జిల్లావ్యాప్తంగా ఉన్న వలస కార్మికుల్ని గుర్తించడంలో డీబీఆర్సీ జిల్లా ప్రతినిధులు విశేష కృషి చేశారని అభినందించారు. స్థానిక, వలస వచ్చిన కార్మికులనే వ్యత్యాసం లేకుండా అందరికీ వృత్తిరీత్యా గుర్తింపు కార్డులను మంజూరు చేస్తున్నామన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కార్మిక శాఖ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం యాజమాన్యాల నుంచి అందుతున్న వేతనాలపై కార్మికులతో చర్చించారు. పలువురు కార్మికులు సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకురావడంతో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. డీబీఆర్సీ ప్రోగ్రాం మేనేజర్ సామ్యూల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడికీ శ్రమకు తగిన కూలి అందేలా చూడడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఇండియన్ లేబర్ హెల్ప్‌లైన్ ఫీల్డ్ మొబలైజర్ మిక్కిలి సురేష్‌బాబు పాల్గొన్నారు.

సొసైటీలో అక్రమాలపై విచారణకు ఆదేశం

బాపట్ల టౌన్: దగ్గుమల్లివారిపాలెం ఆది ఆంధ్ర కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీలో అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి కె.వి.రామారావు ఆదేశించారు. నేషనల్ హైవే విస్తరణలో భాగంగా సొసైటీకి చెందిన 10 ఎకరాల భూమిని హైవే అథారిటీ తీసుకొని నష్టపరిహారం కింద సుమారు రూ.4 కోట్లు ఖాతాలో జమచేశారు. ఆ సొమ్మును తమకు అందజేయకుండా కొందరు వ్యక్తులు స్వాహా చేశారని సొసైటీ సభ్యులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఆడిట్ అధికారులు విచారించి, నివేదికను జిల్లా కోఆపరేటివ్ అధికారికి అందజేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి కె.వి.రామారావు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణాధికారిగా కె.మాధవిని నియమించారు. 30 రోజుల్లోగా పూర్తి నివేదిక అందజేయాలని ఆమెను జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఆదేశించారు.